క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో శిరిడీసాయి గ్రామోత్సవం



బాబా ఆలయం వద్ద కోలాటం ఆడుతున్న బాలికలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని శిరిడీ సాయి పల్లకి సేవ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ డి.అప్పారావు, జి.సత్యనారాయణలు పల్లకి సేవను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుమ్మెళ్ల భవానీ ఆధ్వర్యంలో బాలికల బృందం ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఆలయ ఆంధ్రా సాయి గీతా సమాజం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు, బాలికలు కోలాటం ఆడుతూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంలో భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత వల్ల ఉప్పువారి సత్రం, బ్రౌన్‌పేట, కొత్తపేట, చిన్నవీధి, కోటపేట, ఉప్పువారి వీధి, పాత తహసీల్దార్ కార్యాలయం ఏరియా, బలుసుల పేట, సంగీతరావు పేట, వీర్రాఘవపురం, మఠంసెంటర్, కొత్తూరు, నిమ్మతోట, సంపెంగ తోట, తాండ్ర పాపారాయుడు విగ్రహం ఏరియా, గణపతి నగరం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అసౌకర్యం కలుగుతుందన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవి నాగులపల్లి, 11 కేవి యండపల్లి, కొండెవరం ఫీడర్ల వార్షిక మరమ్మతులతో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీ డీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. యండపల్లి, నాగులపల్లి, రమణక్కపేట, కొండెవరం, శొంఠివారిపాకలు, ఎండపల్లి జంక్షన్, కామన్న గారిపాకలు, కొత్త ఇసుకపల్లి, పాత ఇసుకపల్లి, జొన్నలగరువు, సూరప్ప చెరువులకు ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని వివరించారు.

బతుకుబండికి సడన్ బ్రేక్

- రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన లారీ డ్రైవర్
- వాహనం మరమ్మతు చేస్తుండగా మరో లారీ ఢీకొని ఘటన



ప్రమాదంలో కాలు కోల్పోయిన లారీ డ్రైవరు రెహమాన్

పిఠాపురం: ఒక లారీని నడిపే డ్రైవర్ మరో లారీ రూపంలో వచ్చిన ప్రమాదానికి గురై కాలు కోల్పోవలసి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కోల్‌కతాకు చెందిన తేమూర్ రెహమాన్ తన లారీపై బియ్యం లోడు తీసుకుని చెన్నై బయలుదేరాడు. బుధవారం రాత్రి 16వ నంబరు జాతీయ రహదారిలో గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారు ప్రాంతంలో లారీ ఆపి కాలకృత్యాలు తీర్చుకున్నాడు. తిరిగి లారీ బయలుదేరే సమయంలో లారీ బ్రేకుల వాక్యూమ్ లీక్ అవుతున్నట్లు అనుమానం వచ్చి సరిచేసేందుకు లారీ కిందకు వెళ్లాడు. అక్కడ వాక్యూమ్ టాంకు పరిశీలించి దానిని సరి చేసుకుని మళ్లీ లారీ కింద నుంచి బయటకు వచ్చే ప్రయత్నంలో విశాఖ నుంచి బొగ్గు లోడుతో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న మరో లారీ అతని కుడి కాలుపై నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో రెహమాన్ కాలు నుజ్జయ్యింది. దీంతో తీవ్ర గాయాలైన రెహమాన్‌ను అంబులెన్సులో ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి, అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని కుడి కాలును పూర్తిగా తొలగించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం రెహమాన్ పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

రెడ్‌క్రాస్‌కు అవార్డుల పంట

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రాష్ట్రంలో ఉత్తమమైన రెడ్‌క్రాస్‌గా గుర్తింపు పొందిన కాకినాడ రెడ్‌క్రాస్ మరో సారి సత్తా చాటుకుంది. బుధవారం విజయవాడలో జరిగిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సమావేశంలో రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ అందజేశారు. 2021–24 సంవత్సరాలకు కాకినాడ జిల్లా శాఖ మొదటి స్థానం కైవసం చేసుకుది. ఈ పురస్కారాన్ని గవర్నర్ నజీర్ చేతుల మీదుగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు అందుకున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లా ఏడుసార్లు ఈ అవార్డు అందుకొంది.

మట్టి మాఫియా అంతం కావాల్సిందే



బొత్స సత్యనారాయణ జన్మదిన కేక్ కట్ చేస్తున్న దాడిశెట్టి రాజా, జక్కంపూడి రాజా, దవులూరి దొరబాబు



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

- వారం రోజుల్లో ఆపకపోతే పోరాటం ఉధృతం
- అక్రమ కేసులు ఎదుర్కొంటున్న కార్యకర్తలకు అండగా ఉంటా
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో కోఆర్డినేటర్ దవులూరి

సామర్లకోట: నియోజకవర్గంలో మట్టి మాఫియా పెరిగిపోయిందని, సత్వరం దానిని నిలిపివేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ధ్వజమెత్తారు. నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ మట్టి, గ్రావెల్ తవ్వకాల నిలుపుదలకు వారం రోజులు గడువు ఇస్తున్నామని అప్పటికీ అపక పోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై తమ పార్టీ అధికారంలో ఉండగా సవాల్ చేశామని, కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఉలిమేశ్వరంలో రైతులను మోసం చేస్తున్నారని వారికి అండగా ఉంటానని చెప్పారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతోనే ప్రజలకు అండగా ఉండటానికి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ అనే కార్యక్రమంపై నియోజకవర్గ పరిధిలో కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగ నాయకులు, పార్టీ రాష్ట్ర అయ్యరక సంఘం అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్మిక సంఘం నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత దవులూరి సుబ్బారావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షరాలు సేపెని రూప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, నెక్కంటి సాయిప్రసాద్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు అత్తిలి వెంకట సీతారామ స్వామి, మండల ఉపాధ్యక్షులు పేర్నిడి వెంకట్రాయుడు, శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, జిల్లా సహాయ కార్యదర్శి తాటికొండ అచ్చిరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బొత్స సత్యనారాయణ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను దాడిశెట్టి రాజా, జక్కంపూడి రాజా, దవులూరి దొరబాబులు కట్ చేసి పంచారు.

విద్యుదాఘాతంతో వైఎస్సార్ సీపీ నాయకులకు గాయాలు

సామర్లకోట: స్థానిక పూర్ణా కల్యాణ మండపం వద్ద ఫ్లెక్సీకి విద్యుత్ తీగ తగలడంతో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, రంపా రాజు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డారు. బుధవారం సాయంత్రం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న స్వాగత ద్వారాన్ని పైకి లేపుతుండగా ఈ ఘటన జరగడంతో అక్కడే ఉన్న నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, పార్టీ నాయకులు వారిని స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని మెడికర్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, పార్టీ అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు క్షతగాత్రులకు సేవలందించారు.



సురేష్‌కు అందుతున్న వైద్యంపై ఆరా తీస్తున్న దవులూరి దొరబాబు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ కార్మిక సంఘాలు సీఐటీయు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠంసెంటర్, స్టేషన్ సెంటర్‌కు చేరుకుని ధర్నా చేశారు. అక్కడి నుంచి గాంధీచౌక్ మీదుగా బళ్లమార్కెట్ సెంటర్‌కు ర్యాలీ సాగింది. సీఐటీయూ మండల అధ్యక్షుడు బాలం శ్రీనివాసు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల వల్ల యూనియన్లు పెట్టుకునే హక్కు ఉండదని, 8 గంటల పని విధానాన్ని తొలగించి 12 గంటల పని విధానం తీసుకు వస్తారని ఆరోపించారు. కార్మికుల సమ్మెకు యూటీఎఫ్ జిల్లా నాయకులు వర్మ, పి.గిరిధరగోపాలరావు, వి.అప్పల రాజు మద్దతు ఇచ్చారు. కార్యక్రమంలో బేవరేజెస్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు వి అప్పలరాజు, అమలకంటి సోమేష్, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి వి.ఎస్తేరురాణి తదితరులతో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ధర్నా చేసి నిరసన ప్రదర్శన చేశారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ సీపీఐ నాయకులు మడగల రమణ, పెదిరెడ్ల అర్జున్, సప్పా సూరిబాబు మున్సిపల్ కార్మిక సంఘ నాయకుడు కిశోర్, బచ్చా శ్రీను తదితరులు పాల్గొన్నారు

బీజేపీది కార్పొరేట్ అజెండా

పెద్దాపురం: లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అజెండాను అమలు చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ప్రభాకరవర్మ విమర్శించారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో బుధవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల ఉపాధ్యక్షురాలు దాడి బేబీ అధ్యక్షతన సమ్మె చేశారు. ప్రభాకర వర్మ మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాయడానికి బీజేపీ ఈ లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ గిన్నిస్ బుక్, వరల్డ్ బుక్‌ల కోసం ప్రయత్నిస్తున్న చంద్రబాబు దేశంలో అందరి కన్నా ఎక్కువ జీతాలు ఇచ్చి ఆ పుస్తకాల్లోకి ఎక్కవచ్చుకదా అన్నారు. మున్సిపల్ శానిటేషన్, ఇంజినీరింగ్ వర్కర్లను పర్మినెంట్ చేసి అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు ఎంఎస్ మూర్తి, జాన్ కెనడీ, సూరిబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, జర్నలిస్టు సంఘాల నాయకులు, ఎల్ఐసీ యూనియన్ నాయకులు మద్దతు పలుకగా ఆయా ప్రజా సంఘాల నాయకులు చింతల సత్యనారాయణ, కేదారి నాగు, తాడిశెట్టి గంగ, వర్రే గిరి, పాశిల రమణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో..

పిఠాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో కార్మికులు కదంతొక్కారు. తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గొల్లప్రోలు మండలంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు కార్మికులు భారీ ప్రదర్శన చేశారు. ఆశ కార్మికుల జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ పద్మ, గొల్లప్రోలు మండల సీఐటీయూ కార్యదర్శి ఒ.నందీశ్వర రావు మాట్లాడుతూ భారతదేశంలో మూడుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్‌లకు దోచిపెడుతోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.తులసి, పద్మకుమారి, ప్రభావతి, వి వెంకటలక్ష్మి, పి రమణ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో..

రాష్ట్ర సమితి పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు ప్రజా సంఘాలతో సాకా రామకృష్ణ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ముందుగా చర్చి సెంటర్ నుంచి ఉప్పాడ బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న సమ్మె శిబిరంలో నిరసన తెలియజేశారు. సీపీఐ సీనియర్ నాయకులు కేశవరపు అప్పలరాజు ఏఐటీయూసీ నాయకులు సాకా రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ కార్మికుల మెడకు గుదిబండగా మారిన నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాలు కొనసాగించాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బంగారు కన్నయ్య, కార్యదర్శి ధనాల సతీష్, ముత్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ..

కూటమి ప్రభుత్వం వచ్చిన 13 నెలల వ్యవధిలో విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతోందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.శేషుబాబ్జీ అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం పిఠాపురం సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై దుమ్మెత్తి పోశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు జీతాలు పెంచుకోవాలంటే పార్లమెంట్ లోను అసెంబ్లీ లోను బిల్లు ఆమోదించుకుని రూ.2.50 లక్షలు జీతం తీసుకుంటున్నారన్నారు. వీళ్లు చేసేది ఐదేళ్లే కానీ పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో పనిచేసే వారికి రోజుకు రూ.178ల వేతనం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం చాలా సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.చిన్న, విజయ శాంత, వెంకటలక్ష్మి, ఆర్.బేబీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించేవరకు పోరాటం

కొత్తపల్లి: కార్మికుల హక్కులు సాధనకు పోరాటం కొనసాగుతుందని సీపీఎం నాయకులు అన్నారు. నాలుగు కోడ్‌లు రద్దు కోసం దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు బుధవారం అంగన్‌వాడీ, భవన నిర్మాణ కార్మికులు, ఆశ కార్యకార్తలు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ర్యాలీ నిర్వహిచారు. పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ర్యాలీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, గుర్రాల అప్పారెడ్డి, సాంబశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో సార్వత్రిక సమ్మెను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రభాకర వర్మ



గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం వద్ద కార్మికుల మానవహారం



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ధర్నా చేసిన కార్మిక సంఘాల నాయకులు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన ఏఐటీయూసీ నాయకులు



పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

మండల, పట్టణ వైఎస్సార్ సీపీ కమిటీల నియామకం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం పట్టణ గొల్లప్రోలు మండల కమిటీలను నియమిస్తు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

పిఠాపురం పట్టణంలో..

పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడిగా బోను నాని బాబు (దేవా) పైలా నాయుడు, ప్రధాన కార్యదర్శులుగా మేకల పోలారావు, రామకుర్తి నాగబాబు, వజ్రపు బాబి, చెల్లూరి లోవరాజు కార్యదర్శులుగా బిరుసు వర్నేశ్వరరావు, మోర్తా మధు, ఈగల కొండబాబు, గౌతు చంటిబాబు, ఆకెళ్ల రామకృష్ణలను నియమించారు. సభ్యులుగా అద్దంకి స్వామి, ఆర్‌కే నాయుడు, జలాల్, పొలిమేరు రాజు, మర్రి మహేష్, బీరా నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్, చిట్టూరి శ్రీనివాస్, తురాల రాజ్‌కుమార్, కరణం రాజేష్, ఆర్తమూడి డేవిడ్, దాసరి బాలకృష్ణలను నియమించారు.

గొల్లప్రోలు మండలంలో..

మండల పార్టీ అధ్యక్షుడిగా అరిగెల రామయ్యదొరను కొనసాగిస్తు ఉపాధ్యక్షుడిగా ఆకుల వెంకటరాజు, కాకి నాగబాబు, ప్రధాన కార్యదర్శులుగా ఉలవకాయల ఈశ్వరుడు, ఇంటి నారాయణరావు, కందా రమేష్, పిర్ల బాబూరావు, కార్యదర్శులుగా అమలకంటి శ్రీను, మల్లిపూడి గంగాధర్, కడిమిశెట్టి స్వామిరెడ్డి, చల్లా లక్ష్మీనారాయణ, పూసల తుక్కియ్యలను నియమించారు. సభ్యులుగా ములికే శ్రీనివాస్, నాగల కృష్ణ, చిరుకూరి వెంకటరామరాజు, మంగం సతీష్, దులి సత్యనారాయణ, సైతన వీరనాగేశ్వరరావు, కొంగి కిశోర్, గాడి వెంకటరమణ, నక్కా అప్పారావు, కొండల చక్రరావు, జీలకర్ర శివ, పోసిన నందిబాబులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వైఎస్సార్ సీపీ మున్సిపల్ కమిటీల నియామకం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలల్లో పార్టీ కమిటీల నియమాకం జరిగింది. సామర్లకోట పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఇరుసుమల్ల సాయి, సిరిమట్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శులుగా బొందలపు వెంకటరమణ, నాళం వీరభద్రరావు, నేతల శ్రీనివాసరావు, కార్యదర్శులుగా నమ్మి శ్రీనివాసు, గోలి వీరప్రసాద్, మిరియాల సాగర్, మురదా జయకుమార్, తిరుమలశెట్టి ముసలయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అశెట్టి వీరవెంకట సత్యనా రాయణ, బర్లంకి చిన్నా, మిరియాల దుర్గాప్రసాద్, బుంగా సత్యవతి, జోగా రాజు, తలారి వెంకటరమణలను ఎంపిక చేశారు. అదే విధంగా పెద్దాపురం మున్సిపల్ ఉపాధ్యక్షులుగా బొడ్డు సూర్యప్రకాష్, వాసంశెట్టి గంగా, ప్రధాన కార్యదర్శులుగా తల్సికి సత్యభాస్కరరావు, తాటికొండ పెదకాపు, కొట్టి మల్లిబాబు, ముమ్మన వీర వెంకట ప్రకాష్, కార్యదర్శులుగా బొబ్బిలి హరిబాబు, కట్టా రాజాబాబు, విడదాసరి నాగేంద్ర, నీలంశెట్టి శ్రీనివాసు, బొడ్డు శివ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కంపర భద్రరావు, గడపా శివ, పెంటకోట సత్యనారాయణ, వీరేశ్వరపు ఏసుబాబు, పెదపూడి కృష్ణకిశోర్, పప్పల దుర్గ, దువ్వా వెంకటరమణ, డి.రమేష్ ఎన్నికయ్యారు.

పంచాయతీలను బలోపేతం చేయాలి

సామర్లకోట: పంచాయతీలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులకు ఒక రోజు శిక్షణ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చే సమయంలో శిక్షణలోని అంశాలను అధికారులు పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమానికి ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి అధ్యక్షత వహించగా ఈఓ పీఆర్డీ భైరవమూర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి పిలిస్తే.. చెట్టు చాటుకే!

- ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల అవస్థలు
- మరుగుదొడ్లు ఉన్నా కొందరి కోసమే
- స్వచ్ఛ పథకాలు ప్రచారానికే పరిమితం



పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు

పెద్దాపురం: ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వెళ్లే ప్రజలకు బయటకు చెప్పుకోలేని ప్రధాన సమస్య మరుగు సమస్య. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని నిర్మించినా అక్కడి సిబ్బంది మాత్రమే వాటిని వినియోగించుకునేలా ఏర్పాటు చేసుకుంటారు. పలు చోట్ల తాళాలు కూడా వేసి సంబంధిత వాచ్‌మెన్ వద్దనో మరెక్కడో ఉంచుతారు మరెవరూ వినియోగించకుండా.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలని, ఆరుబయట మల విసర్జన వల్ల వ్యాధులు ప్రబలుతాయని అధికారులు నిత్యం ప్రచారం చేస్తూ మారుమూల గ్రామాల్లో సైతం వడివడిగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. అయితే వారి కార్యాలయాలకు వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారి కోసం మాత్రం నోరు మెదపరు. పెద్దాపురం మండల కేంద్రానికి నిత్యం ఏదో అవసరార్థమై స్త్రీ, పురుషులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి తరచూ వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాలకు మండల కేంద్రం పదుల కిలో మీటర్ల దూరంలో ఉన్నా పనులన్నీ అక్కడే జరుగుతాయి. భూ సమస్యల పరిష్కారం, రుణాల కోసం, భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, సబ్ ట్రెజరీ ఇలా అనేక సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. డ్వాక్రా మహిళలు, కక్షిదారులు తదితరులు రోజూ వస్తూనే ఉంటారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల కోసం వేచి చూసే వారికి మాత్రం కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసే కార్యాలయాల వద్దే స్వచ్ఛ స్ఫూర్తి కానరాకపోవడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

పెద్దాపురంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, సబ్ జైలు, ఉపాధి హామీ పథకం కార్యాలయం, వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయం అన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. వీటిలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనే మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వచ్చే వారి కోసం కనీసం ఒక్క మరుగుదొడ్డి సైతం లేదు.

గోడ చాటు వెతుక్కోవలసిందే

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళల అవస్థలు వర్ణనాతీతం. వివిధ ప్రాంతాల నుంచి పెద్దాపురానికి రోజుకు సుమారు 300 మంది వరకు ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. అత్యావసర సమయంలో మరుగుదొడ్డి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయాల గోడల చాటుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. నిబంధనల మేరకు మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి. ఉద్యోగులు, సిబ్బంది, కార్యాలయాలకు వచ్చే వారికి అందుబాటులో ఉండాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మరుగు అవసరాలు తీర్చాలి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ప్రతి రోజూ మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణ పరిధిలో అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్నారు. కక్షిదారులు, విక్రయదారులు మరుగుదొడ్డు లేక మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి.

– గుణ్ణం లక్ష్మణరావు,
ఫర్ ద పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు,
పెద్దాపురం

దారి లేదు.. దాహం తీర్చండి

- పాడా పీడీ వద్ద సూరంపేటవాసుల ఆందోళన



తాగునీటి సమస్యను పాడా పీడీకి విన్నవిస్తున్న మహిళలు

పిఠాపురం: వానొచ్చినా వరదొచ్చినా మాకు దారి ఎలాగూ లేదు.. కనీసం తాగునీరైనా ఇప్పించండి అంటు పాడా పీడీ చైత్రవర్షిణి వద్ద గొల్లప్రోలు సూరంపేట వాసులు మొరపెట్టుకున్నారు. బుధవారం సూరంపేట వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన పరిశీలనకు వెళ్లిన ఆమెను కలిసిన స్థానికులు తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. అప్పుడప్పుడు ట్యాంకర్ పంపించి తర్వాత పంపించడం లేదని వారు ఆమెకు వివరించారు. దీంతో ఆమె కమిషనర్‌ను పిలిచి రోజువారీ ట్యాంకర్లు పంపించాలని సమస్యను పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. 15 రోజులలో దారి మార్గాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె పబ్లిక్ హెల్త్ డీఈ గంగరాజును ఆదేశించారు. అలాగే వరద నీటికి గట్లుకొట్టుకుపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారుల సలహా తీసుకుని అంచనాలు సవరించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా నష్టం కలగకుండా ఏ చర్యలు తీసుకోవాలో ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావుతో చర్చించి ముంపు బారిన పడకుండా అవసరమైన చర్యల్లో భాగంగా ఒకటి రెండు తూరలను తొలగించాలని ఆమె అధికారులకు సూచించారు. ఇప్పటికే పనులు ఆలస్యం కావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారని ఆమె చెప్పారు. ఆమె వెంట తహసీల్దారు గోపాలకృష్ణ మున్సిపల్ కమిషనర్ కనకారావు ఎంపీడీవో స్వప్న, పీబీసీ డీఈ సంతోష్ కుమార్ ఏఈ పద్మజ తదితరులు ఉన్నారు.

బీఎల్‌ఓలు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

కాకినాడ సిటీ: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్వో, ఆర్డీవో ఎస్.మల్లిబాబు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులకు వారం రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. నియోజక వర్గం పరిధిలో 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులు సమగ్రంగా నిర్వహించాలని మల్లిబాబు సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఫారం 6, 6ఏ, 7, 8 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించి నివేదిక సమర్పించాలని సూచించారు. బీఎల్‌వోలకు కేటాయించిన పార్ట్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలను తరుచుగా సందర్శించి అవసరమైన సవరణలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించడం, డిద్దుబాట్లు మొదలైన వాటిని గుర్తించడం తదితర ప్రక్రియల అనంతరం ఈఆర్వోకు సమర్పించాలని ఆర్డీఓ మల్లిబాబు కోరారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి దేవదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కలెక్టర్ భారతి, కాకినాడ రూరల్ తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.